శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు రాతపరీక్షలు

పరీక్ష పేపర్లు అందజేస్తున్న సేవా అధ్యక్షురాలు రాధాకుమారి

సీసీసీ నస్పూర్, జూలై 25 : నస్పూర్‌కాలనీ సేవా భవన్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో (2023-24) వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు గురువారం రాతపరీక్షలు నిర్వహించారు. 477 మంది శిక్షణ పొందగా, 362 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ సేవా అధ్యక్షురాలు రాధాకుమారి అభ్యర్థులకు ప్రశ్నపత్రాలు అందజేసి, పరీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవింద రావు, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు రీజినల్ అధికారి అనసూయ, సీనియర్ పీవో కాంతారావు, సింగరేణి సేవా సమితి చీఫ్ కోఆర్డినేటర్ శివకుమార్, ఖాదీ గ్రామోద్యోగ్ ఆఫీసర్ బానోతు నరేశ్, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితులకు చేయూతనివ్వడం అభినందనీయం

కృష్ణకు చెక్కు అందజేస్తున్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే ఓదెలు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి , పూర్వ విద్యార్థులు.

మందమర్రి, జూలై 25 : ఆర్థికంగా వెనుకబడిన స్నేహితులకు తోటి విద్యార్థులు చేయూతనివ్వడం అభినందనీయమని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు అన్నారు. మందమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1984-85 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు స్థానిక మంజునాథ గార్డెన్‌లో బుధవారం రాత్రి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 39 ఏండ్ల క్రితం విడిపోయిన స్నేహితులు ఒక్కచోట కలవడం గొప్ప అనుభూతినిస్తుందని పేర్కొన్నారు. 1984-85 బ్యాచ్ వెల్ఫేర్ సొసైటీని పటిష్టం చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆర్థికంగా వెనుకబడిన పూర్వ విద్యార్థి కేఎల్ఆర్ కృష్ణకు రూ.20 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, పూర్వవిద్యార్థులు, నాయకులు కాంపెల్లి సమ్మయ్య, గుడ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి

ఆసిఫాబాద్ టౌన్, జూలై 25 : రాష్ట్ర ప్రభుత్వం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు మొండి చేయి చూపిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు ప్రాణాధారమైన ప్రాణహిత చేవెళ్ల, అడ ప్రాజెక్టుతో పాటు, ఇతర ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం అధికార పార్టీకి జిల్లాపై ఉన్న ప్రేమను తెలిసేలా చేస్తున్నదన్నారు. నీతి అయోగ్‌లో ఆస్పిరేషన్ జిల్లాగా ఎన్నికైన జిల్లాను పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కోట్నాక విజయ్, ఖాండ్రే విశాల్, చర్ల మురళి, అరిగెల మల్లికార్జున్, సత్యనారాయణ, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఆర్కే-5 గనిపై మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్, అధికారులు

కాసిపేట : మొక్కలు నాటుతున్న ఆర్డీవో, ఎఫ్‌డీవో, జీఎం, అధికారులు

ఎన్టీపీపీలో మొక్కలు నాటుతున్న జీఎం శ్రీనివాసులు, సీఐఎస్ఎఫ్ ఐజీ శరవణన్

వృక్షారోపన్ అభియాన్ ప్రారంభం

శ్రీరాంపూర్, జూలై 25 : శ్రీరాంపూర్ ఆర్కే-5 గనిపై జీఎం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వృక్షారోపన్ అభియాన్ కార్యక్రమం ద్వారా మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ మొక్కలు నాటి ప్రారంభించారు. 75 వన మహోహత్సవంలో భాగంగా మొక్కలు నాటినట్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో 20,750 మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, పీవో శ్రీఇవాస్, ఏజెంట్ ఏపీ రెడ్డి, రాముడు, మేనేజర్ అబ్దుల్ ఖాదర్, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సేఫ్టీ ఆఫీసర్ శివయ్య, సీనియర్ పీవో రణదీప్‌గౌడ్ పాల్గొన్నారు.

కాసిపేట, జూలై 25 : సోమగూడెం పాత బస్తీ బ్రిడ్జి సమీపంలోని కేకే ఓసీ రాళ్ల వాగు లీజ్ హోల్డ్ ఏరియాలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎఫ్‌డీవో విజయ్ కుమార్, ఎఫ్ ఆర్వో సుభాష్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌తో కలిసి మందమర్రి ఏరియా జీఎం ఏ మనోహర్ 3 హెక్టార్లలో 300 మొక్కలు నాటారు. అనంతరం ఉద్యోగులకు, చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు మొక్కలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఆంజనేయులు, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేశ్, ఏరియా సేఫ్టీ అధికారి రవీందర్, ఏరియా సర్వే ఆఫీసర్ ఉజ్వల్ బందోపాధ్యాయ, ఏజీఎం ఈఅండ్ఎం నాగరాజు, డీజీఎం ఐఈడీ రాజన్న, కేకే ఓసీ పీవో రమేశ్, ప్రాజెక్ట్ ఇంజినీర్ సూర్యనారాయణ రాజు, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి, ఎన్విరాన్‌మెంట్ అధికారి ప్రభాకర్, ఐటీ సీనియర్ ప్రోగ్రామర్ రవి, సీనీయర్ అధికారులు, జీఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్, జూలై 25 : ఎన్టీపీపీలోని టైం ఆఫీస్ సమీపంలో అధికారులు మొక్కలు నాటారు. జీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తిలో పర్యావరణానికి కొంత హానికలిగే అవకాశం ఉన్నందున విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ఎన్టీపీపీ సంధర్శన కోసం వచ్చిన సీఐఎస్ఎఫ్ ఐజీ ఎస్ఆర్ శరవణన్.. అధికారులతో కలిసి మొక్కలు నాటారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేశ్ పర్మార్, సీఎంవోఏఐ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు పర్శయ్య, ఏజీఎం సివిల్ ప్రసాద్, ఏజీఎం ఫైనాన్స్ సుధాకర్, ఏజీఎం ఎఫ్‌జీడీ మదన్‌మోహన్, పీఎంపీఎల్ ప్లాంట్‌హెడ్ అఖిల్‌కపూర్, డీజీఎం ఎన్విరాన్‌మెంట్ వాసుదేవమూర్తి, మేనేజర్ ఫారెస్ట్ చంద్రమణి, పీఎం రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

డప్పు కొడుతూ.. గుండెపోటుకు గురై

ఒకరి అంత్యక్రియల్లో డప్పు కొడుతూ కుప్పకూలి మృతి

కాసిపేట, జూలై 25 : కాసిపేట మండల కేంద్రానికి చెందిన డప్పు కళాకారుడు రెడపాక బాపు(55) గుండె పోటుతో మృతి చెందాడు. కాసిపేట గని సింగరేణి ఉద్యోగి ఏల్పుల అంకులు(57) ఇటీవల ఇంట్లో జారి పడడంతో వెన్నుపూసకు తీవ్రగాయమైంది. బీజోన్ సింగరేణి దవాఖానలో చికిత్స పొందుతుండగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈయన అంతక్రియల కార్యక్రమానికి హాజరైన, డప్పు కళాకారుడు రెడపాక బాపు.. డప్పు కొడుతుండగా ఛాతిలో నొప్పిరావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే దవాఖానకు తరలించగా, అప్పుడికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన భార్య శంకరమ్మ, ఇద్దరు ఆడ పిల్లలున్నారు. ఆయనకు శంకరమ్మ అంతక్రియలు నిర్వహించడం చూసే వారికి కంటతడి పెట్టించింది.

యువకులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

మందమర్రి, జూలై 25 : గంజాయి వినియోగదారులకు వారి తల్లిదండ్రులకు మందమర్రి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టణంలో గంజాయి సేవిస్తున్న కొందరు యువకులను గుర్తించిన పోలీసులు, వారిని స్టేషన్‌కు పిలిపించారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో గురువారం మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి గంజాయి సేవించడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పట్టణంలో గంజాయి సేవిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది 9 మంది గంజాయి విక్రయ నేరస్తులపై 06 ఎన్డీపీస్ కేసులు నమోదు చేసి 3.3 కిలోల గంజాయి, 13 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పాత నేరస్తులపై హిస్టరీ షీట్ కూడా ఓపెన్ చేసినట్లు చెప్పారు. యువకులకు మంచిర్యాలలోని డీ అడిక్షన్ సెంటర్‌లో డాక్టర్ల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి మందులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ఎత్తుకొని వాగు దాటించి

పెంచికల్‌పేట్,జూలై 25 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు పెంచికల్ పేట్ మండలం జైహింద్‌పూర్ ప్రభుత్వ పాఠశాల పక్కనుంచి పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా, ఉపాధ్యాయుడు సంతోష్ విద్యార్థులను ఎత్తుకొని వాగు దాటించి గొప్పతనాన్ని చాటుకున్నాడు. గురువారం ఉదయం వాగులో వరద తక్కువగా ఉండగా, 26 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చారు. సాయంత్రం వరకు ముసురు పడడంతో వాగులోకి వరద చేరింది. దీంతో పిల్లలు వాగు దాటే పరిస్థితి లేకపోయింది. దీంతో ఉపాధ్యాయుడు సంతోష్, మరో యువకుడితో కలిసి ఇద్దరి చొప్పున.. ఇలా 10 మంది విద్యార్థులను ఎత్తుకొని వాగు దాటించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మారుమూల గ్రామంలో నిస్వార్థంతో సేవలందిస్తున్న ఉపాధ్యాయుడిని గ్రామస్తులు అభినందించారు. కాగా, స్కూల్ (వాగు) అవతలి వైపు ఉన్న మరో 16 మంది విద్యార్థులు ఎంచక్కా ఇళ్లకు చేరుకున్నారు.

విద్యార్థులను ఎత్తుకొని జైహింద్‌పూర్ వాగు దాటిస్తున్న ఉపాధ్యాయుడు సంతోష్

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

రెబ్బెన, జూలై 25 : సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపినట్లు సీఆర్పీలు దేవేందర్, రాజేశ్, సత్యనారాయణ, మహేశ్వర్ తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు దాని ఊసేలేదని ఆరోపించారు. సీసీవో భాగ్యలక్ష్మి, కేజీబీవీ ఎస్‌వో పద్మ పాల్గొన్నారు.

పిట్ సేఫ్టీ కమిటీ సమావేశం

కాసిపేట, జూలై 25 : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిలో జీఎం మనోహర్ పిట్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతిరోజూ పని ప్రదేశానికి వెళ్లే ముందు ఆ పనిలో సంభవించే ప్రమాదాలను గురించి, ఏదైనా కొత్త పని ప్రారంభించే ముందు ఆ పని గురించి చర్చించాలన్నారు. ఎల్లవేళలా రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధించాలన్నారు. సమావేవంలో రక్షణాధికారి సునీల్ కుమార్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేశ్, పిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వర్క్‌మన్ ఇన్‌స్పెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

దండేపల్లి, జూలై 25 : దండేపల్లి మండలం సర్సాపూర్ గ్రామంలో డప్పు శాంత కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, రెండు నెలలకు సరిపడా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు భానుప్రసాద్, ప్రధాన కార్యదర్శులు నవీన, లక్ష్మణ్, అల్లంల కుమారస్వామి, సభ్యులు ఉన్నారు.

డీటీవోను కలిసిన డీఎం

మంచిర్యాలటౌన్, జూలై 25 : మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన జనార్దన్ గురువారం డీటీవో సంతోష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కరీంనగర్ డిపో వర్స్‌షాప్‌లో పనిచేస్తున్న ఆయనను మంచిర్యాల డీఎంగా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేసిన రవీంద్రనాథ్ హుజురాబాద్ డీఎంగా బదిలీపై వెళ్లారు.

విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, జూలై 25 : అమృత్‌సర్‌లోని గురునానక్ యూనివర్సిటీలో ఆగస్టు 7న నిర్వహించే జాతీయ ఓబీసీ తొమ్మిదో మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రూపునర్ రమేశ్ పేర్కొన్నరు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా బీసీ సంఘం, అనుబంధ విద్యార్థి, మహిళా, యువజన సంఘాల బాధ్యులు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

గల్ఫ్ కార్మికులకు అన్యాయం

దండేపల్లి, జూలై 25 : ప్రభుత్వం బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికులకు మొండి చేయి చూపిందని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమయ్య అన్నారు. ఒక్క రూపాయి కూడా గల్ఫ్ కార్మికుల సమక్షేమానికి కటాయించకపోవడం బాధాకరమన్నారు. ఏప్రిల్ 16న సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి గల్ఫ్ సంఘాల సమావేశంలో ఇచ్చిన మాటలు నీటి మూటల్లాగానే మిగిలిపోయాయని విమర్శించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి సభ్యులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కౌటాల, జూలై 25 : హెట్టి గ్రామానికి చెందిన పోరెత్ అశ్విని(23) వారం క్రితం పురుగుల మందుతాగగా, పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతిచెందిందని ఎస్ఐ మధూకర్ తెలిపారు. అశ్విని ఏడాది క్రితం టేకంగూడ గ్రామానికి చెందిన వ్యక్తితో ప్రేమ వివాహం చేసుకుంది. ఇటీవల తల్లిగారి ఇంటికి వచ్చిన ఆమె, వారం క్రితం పురుగుల మందు తాగిం ది. వెంటనే కౌటాల పీహెచ్‌సీకి, అక్కడి నుంచి సిర్పూర్ ప్రభు త్వ దవాఖాన, మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవా రం రాత్రి మృతి చెందింది. తండ్రి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా సత్యనారాయణ

కోటపల్లి, జూలై 25 : కోటపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో ఆకుల భూమయ్య నెలరోజులు సెలవుపై వెళ్లగా, ఎంపీవో సత్యనారాయణకు ఇచ్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

వాణిజ్య

రియల్ పన్ను పోటు

స్థిరాస్తి క్రయవిక్రయాలకు దెబ్బ • బడ్జెట్‌లో ఇండెక్సేషన్ బెనిఫిట్ దూరం

పెరిగిన ఎల్‌టీసీజీ పన్ను భారం • నిర్మాణ రంగానికి నష్టమేనంటున్న నిపుణులు

మధ్యతరగతి సొంతింటి కలల్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్ చెరిపేసింది. ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించి మోయలేనంత పన్ను భారాన్ని మోదీ సర్కారు మోపింది మరి. స్థిరాస్తి క్రయవిక్రయాలను ఆందోళనకరం చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయంపట్ల నిర్మాణ రంగ పరిశ్రమ భగ్గుమంటున్నదిప్పుడు.

న్యూఢిల్లీ, జూలై 25: కరోనా ప్రభావం నుంచి నెమ్మదిగా బయటపడిన స్థిరాస్తి రంగం.. మళ్లీ మందగమనంలోకి వెళ్లనుందా? బడ్జెట్‌లో మోపిన పన్ను భారంతో క్రయవిక్రయాలు పడిపోనున్నాయా? ధరలు పెరిగి సామాన్యుల సొంతింటి కలలు చెదిరిపోతాయా?.. దేశీయ నిర్మాణ రంగాన్ని ఇప్పుడు కుదిపేస్తున్న ప్రశ్నలివే. అవును.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్.. రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీని ఒక్కసారిగా షాక్‌కు గురిచేసింది మరి.

ఇదీ సంగతి..

పార్లమెంట్‌లో ఈ నెల 23న (మంగళవారం) ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో స్థిరాస్తులు, ఇతర ఆర్థిక, ఆర్థికేతర ఆస్తుల అమ్మకాలపై ఇండెక్సేషన్ బెనిఫిట్స్‌ను తొలగిస్తున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగంపై ఇది తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని ఇప్పుడు మెజారిటీ ఇండస్ట్రీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ లేదా దీర్ఘకాల మూలధన లాభాలు) పన్నుకు ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తీసేస్తున్నట్టు విత్త మంత్రి వెల్లడించారు. అలాగే ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను 12.5 శాతానికి తగ్గిస్తున్నట్టూ చెప్పారు. ఇంతకుముందు ఇండెక్సేషన్ ప్రయోజనంతో 20 శాతంగా ఉండేది. అయితే గతంతో పోల్చితే పన్ను శాతం దాదాపు సగానికి తగ్గినా.. ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను దూరం చేయడం వల్ల స్థిరాస్తి అమ్మకం దారులపై ట్యాక్స్ భారం ఇంకా పెరుగుతుండటమే ఇప్పుడు అందరి ఆందోళనకు కార ణమవుతున్నది. ముఖ్యంగా రీ-సేల్ మార్కెట్ కుదేలవుతుందన్న అభిప్రాయాలున్నాయి.

ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటే?

2001 తర్వాత కొన్న ఇండ్లను ఇప్పుడు అమ్మితే.. కొనుగోలు చేసిన ధరపై వచ్చిన లాభానికి ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా ఎల్‌టీసీజీ పన్ను 12.5 శాతం వర్తిస్తుందని బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అయితే అంతకుముందు (2001 మార్చి 31 లోపు) కొన్న ఇండ్లను అమ్ముకుంటే మాత్రం ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంటుంది. ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ) నంబర్ల ఆధారంగా లెక్కిస్తారు. 2001-02 నుంచి (2001 ఏప్రిల్ నుంచి) ప్రతీ ఆర్థిక సంవత్సరం ఈ సీఐఐ నంబర్‌ను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ విడుదల చేస్తూ వస్తున్నది. 2001-02లో నాటి ద్రవ్యోల్బణం ఆధారంగా ఇది 100గా ఉన్నది. ఈ బేస్ రేటు (100)నే 2001 కంటే ముందు ఇండ్లు కొన్నవారికి ఇండెక్సేషన్ బెనిఫిట్ లెక్కింపునకు వాడుతున్నారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఇప్పటి ద్రవ్యోల్బణం రేటు ప్రకారం సీఐఐని 363గా నిర్ణయించారు. దీని ప్రకారం 2001-02 ఆర్థిక సంవత్సరంలో మీరు లక్ష రూపాయలకు ఇల్లు కొంటే.. ప్రస్తుతం దాని విలువ రూ.3.63 లక్షలు అన్నమాట. ఇంతకు మించిన ధరకు ఇల్లును మీరు అమ్ముకుంటే అందులో సదరు రూ.3.63 లక్షలుపోను మిగతా మొత్తానికే ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీన్నే ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటారు. అయితే ఇది పాత పన్ను ప్రకారం. తాజా బడ్జెట్‌లో చేసిన మార్పుల ప్రకారం ఇంటిని అమ్ముకున్న ధరలో నుంచి కొన్న ధర లక్ష మాత్రమే తీసేస్తారు. మిగతా మొత్తం అంతటికీ పన్ను పడుతుంది.



పాత పన్ను ప్రకారం

2018-19లో రూ.50 లక్షలతో రాజేశ్ ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 280గా ఉన్నది. 2024-25లో రాజేశ్ ఆ ఇంటిని రూ.70 లక్షలకు అమ్మేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సీఐఐ 363గా ఉన్నది. దీంతో ఇంటిని అమ్మిన ఆర్థిక సంవత్సరం సీఐఐతో.. ఇంటిని కొన్న ఆర్థిక సంవత్సరం సీఐఐని భాగించడం జరుగుతుంది. 363/280=1.296428 వస్తుంది. దీన్ని ఇంటిని కొన్న ధర రూ.50 లక్షలతో గుణిస్తే.. రూ.64,82,142గా ఉంటుంది. ఇంటిని అమ్మడం ద్వారా వచ్చిన రూ.70 లక్షల్లో నుంచి ఈ రూ.64,82,142ను తీసేయాలి. అప్పుడు రూ.5,17,858 వస్తుంది. దీనిపై ఎల్‌టీసీజీ పన్ను 20 శాతం అంటే రూ.1,03,571.6 చెల్లిస్తే సరిపోతుంది.

కొత్త పన్ను ప్రకారం

అమ్మిన ధర రూ.70 లక్షల నుంచి కొన్న ధర రూ.50 లక్షలను తీసేస్తే.. మిగిలే ఆ రూ.20 లక్షలపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలి. అంటే రూ.2.50 లక్షలు చెల్లించాలి. ఎల్‌టీసీజీకి ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తొలగించడం వల్ల గతంతో పోల్చితే ఇంటి అమ్మకంపై సుమారు రూ.1.47 లక్షలు అదనంగా ట్యాక్స్‌పేయర్లు చెల్లించాల్సి వస్తున్నదన్నమాట.

ఇండస్ట్రీ వర్గాల ఆందోళనలివీ..

- ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తాజా బడ్జెట్‌లో తీసేయడం వల్ల రీసేల్ మార్కెట్ లావాదేవీలు మందగిస్తాయి.
- ఎప్పుడో కొన్న ఇండ్లు, భూములను ఇప్పుడు అమ్మేందుకు వాటి యజమానులు పన్ను భారం కారణంగా ఆసక్తి చూపరు.
- కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అమ్మకందారులకు పన్ను భారం పెరిగి లాభాలు తగ్గుతాయి.
- పన్నుల కారణంగా స్థిరాస్తి ధరలను అమ్మకందారులు అమాంతం పెంచేస్తారు. దీనివల్ల కొనుగోలుదారులు ముందుకురాని దుస్థితి నెలకొంటుంది.
- పన్నుల్ని తప్పించుకోవడానికి నగదు లావాదేవీలనే అంతా ఎంచుకుంటారు. ఇది ప్రభుత్వ ఖాజానాకు, నిర్మాణ రంగానికి కూడా నష్టం.
- కొత్త పెట్టుబడులు రాక నిర్మాణ ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఆగిపోయే ప్రమాదం.
- ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించడం వల్ల రియల్టీలోకి బ్లాక్‌మనీ రాక పెరుగుతుంది.

మరో 1,000 తగ్గిన బంగారం ధర

- 3 రోజుల్లో రూ.5,000 పతనం
- హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు తులం రేటు

న్యూఢిల్లీ, జూలై 25: బంగారం ధరలు భారీగా దిగొస్తున్నాయి. గురువారం తులం రేటు మరో రూ.1,000కిపైగా పడిపోయింది. దీంతో 24 క్యారెట్ 10 గ్రాముల విలువ హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు చేరి రూ.69,820గా నమోదైంది. బుధవారంతో చూస్తే రూ.1,040 తగ్గింది. ఇక 22 క్యారెట్ రూ.950 దిగి రూ.64,000గా ఉన్నది. ఢిల్లీలో మాత్రం రూ.70,650 వద్ద స్థిరపడింది. ఇక్కడ అంతకుముందు రెండు రోజుల్లో రూ.4,000 దిగజారగా.. మొత్తం ఈ మూడు రోజుల్లో రూ.5,000 పతనం కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలో ధరల క్షీణత, నగల వర్తకులు అమ్మకాల ఒత్తిడికి లోనవడంబులియన్ మార్కెట్‌ను దిగువ ముఖం పట్టిస్తున్నాయి. మరోవైపు కిలో వెండి ధర కూడా ఢిల్లీలో రూ.3,500 తగ్గి రూ.84,000గా ఉన్నది. హైదరాబాద్‌లో రూ.84,500 పలుకుతున్నది. బడ్జెట్‌లో బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాలకు కోత పెట్టడంతో.. ఒక్కసారిగా బయ్యర్లు, ఇన్వెస్టర్లు రివర్స్‌గేర్ వేశారు. కాగా, గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు బంగారం 2361 డాలర్లు పలికితే.. వెండి 28.04 డాలర్లుగా నమోదైంది.

ఐడీబీఐ అమ్మకానికి అంతా సిద్ధం

- త్వరలో ఆర్బీఐ నుంచి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, జూలై 25: ప్రభుత్వ రంగ సంస్థ, ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకు లైన్ క్లియరవుతున్నది. బ్యాంక్‌ను చేజిక్కించుకొనేందుకు వీలున్న మదుపరులకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి కావాల్సిన భద్రతాపరమైన అనుమతులు వచ్చేశాయి. ఈ మేరకు గురువారం సంబంధిత అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు. అలాగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి కూడా అనుమతి త్వరలోనే వస్తుందన్నారు. కాగా, ఐడీబీఐలో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ 30.24 శాతం, కేంద్ర ప్రభుత్వం 30.48 శాతం వాటాలను అమ్మేయనున్నాయి. ఈ బ్యాంక్‌లో కేంద్రానికి, ఎల్ఐసీకి కలిపి మొత్తం 94.72 శాతం వాటా ఉన్నది.

కెనరా బ్యాంక్ లాభం 3,905 కోట్లు

తొలి త్రైమాసికంలో 10 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, జూలై 25: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికపు నికర లాభంలో 10 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.3,535 కోట్లుగా ఉన్న నికర లాభం గత త్రైమాసికానికిగాను రూ.3,905 కోట్లకు ఎగబాకింది. మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని బ